క్లుప్తంగా

రామాలయ నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ



పాలమూరులో రామాలయ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి దంపతులు

అనపర్తి: పాలమూరు కాలువ అవతల నూతనంగా నిర్మించే రామాలయ నిర్మాణానికి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు శుక్రవారం భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే దంపతులు వేద పండితుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు జరిపి, రామాలయ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. జెడ్పీటీసీ సత్తి గీతావరలక్ష్మి, వెంకటరెడ్డి, ఎంపీపీ అంసూరి సూర్యనారాయణ, సర్పంచ్ గుడాల ధనలక్ష్మి, జెడ్పీ మాజీ ప్రతిపక్ష నాయకుడు సత్తి రామారెడ్డి, ఉప సర్పంచ్ సత్తి సూరారెడ్డి, ఎంపీటీసీ సత్తి కనకారెడ్డి, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ కన్వీనర్ చందు, మాజీ సర్పంచ్ మేడపాటి గంగిరెడ్డి, సత్తి అమ్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహిళా ఉపాధ్యాయ దినోత్సవం



వెదుళ్లపల్లిలో టీచర్‌ను సత్కరిస్తున్న దృశ్యం

సీతానగరం: మండలంలోని వెదుళ్లపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్లో మహిళా ఉపాధ్యాయ దినోత్సవం, సావిత్రీబాయి పూలే జయంతిని మండల యూటీఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా కార్యదర్శి ఈ.శ్రీమణి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తొలుత సావిత్రీబాయి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. పలువురు మాట్లాడుతూ స్త్రీల విద్య కోసం జీవితాన్ని త్యాగం చేసిన భారతీయ మొదటి మహిళా ఉపాధ్యాయురాలు, సంఘ సంస్కర్త సావిత్రీబాయి అని కొనియాడారు. ఈ సందర్భంగా ఉన్నత పాఠశాలల నుంచి ఎల్.సీతారత్నం, ఎస్.ఉషారాణి, కె.సూర్యకుమారి, బి.రాజమ్మాయి, వై.మంగాలక్ష్మి, ఆర్.మమత, ఎన్.భూదేవి, అలాగే ప్రాథమిక పాఠశాలల నుంచి ఎన్.నాగమణి, కె.సుబ్బలక్ష్మి, పీఎం అరుణ కాంతి, బి.లక్ష్మి, ఎంటీఎస్ టీచర్ జి.జాన్ వినీల గ్రేస్, అంగన్‌వాడీ సీనియర్ టీచర్ ఎం.వెంకటేశ్వరిని సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు.

వీరుళ్లమ్మ అమ్మవారికి హరిద్రాభిషేకం



బిందెలతో గోదావరి జలాలను ఊరేగింపుగా తీసుకువస్తున్న మహిళలు

అనపర్తి: అనపర్తి గ్రామ దేవత వీరుళ్లమ్మ అమ్మవారి మూలవిరాట్‌కు శుక్రవారం మహిళలు సంప్రదాయబద్ధంగా హరిద్రాభిషేకం ఘనంగా నిర్వహించారు. సంక్రాంతిని పురస్కరించుకుని ఈ నెల 14వ తేదీ నుంచి ప్రారంభం కానున్న అమ్మవారి జాతర, తీర్థ మహోత్సవాలను పురస్కరించుకుని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులు హరిద్రాభిషేకం వైభవంగా జరిపారు. గ్రామానికి చెందిన సుమారు వెయ్యి మంది ముత్తైదువులు సామూహికంగా స్థానిక ఎర్రకాలువ నుంచి బిందెలతో గోదావరి జలాలను తీసుకుని, మంగళ వాయిద్యాలు, బాణసంచా కాల్పుల నడుమ ఊరేగింపుగా ఆలయం వద్దకు తోడ్కొనివచ్చారు. అనంతరం పసుపు, పుష్పాలు కలిపిన జలాలతో వీరుళ్లమ్మవారి మూలవిరాట్‌కు హరిద్రాభిషేకం చేశారు. ముందుగా ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి సతీమణి ఆదిలక్ష్మి అమ్మవారి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు నిర్వహించి, హరిద్రాభిషేకం నిర్వహించారు. ఈ నెల 14 నుంచి 19 వరకు అమ్మవారి జాతర, తీర్థ మహోత్సవాలు జరగనున్నాయి.

పారిశుధ్య చర్యలు మరింత మెరుగుపర్చాలి

పెదపూడి: ఆరోగ్యవంతమైన గ్రామాల నిర్మాణానికి పారిశుధ్య చర్యలు మరింత మెరుగుపర్చాలని ఈఓపీఆర్డీ ఎం.సత్యనారాయణరెడ్డి అన్నారు. జి.మామిడాడ, పెదపూడి గ్రామాల్లో మురుగు కాల్వల్లో తొలగిస్తున్న పూడిక పనులను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్య పనులను ప్రతిరోజు సచివాలయ కార్యదర్శులు పరిశీలించాలన్నారు. మురుగు కాల్వల్లో పూడిక, రోడ్ల పక్కన చెత్తకుప్పలు తొలగించాలన్నారు. గ్రామాల్లో ప్రజలకు ఎలాంటి తాగునీటి ఎద్దడి లేకుండా అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలన్నారు. తాగునీరు రక్షిత పథకాలను నిర్ణీత సమయంలో శుభ్రం చేసి, క్లోరినేషన్ చేయాలన్నారు. గ్రామాల్లో పన్నుల వసూళ్లు వేగంగా పూర్తి చేయాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



ఆకట్టుకున్న విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు

తెలుగు సోయగం.. కనుల వైభవం

- గైట్‌లో ప్రారంభమైన ప్రపంచ తెలుగు మహాసభలు
- ఆకట్టుకున్న కార్యక్రమాలు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఛత్తీస్‌గఢ్ గవర్నర్ హరిచందన్, స్వరూపానందేంద్ర స్వామి తదితరులు

రాజానగరం: తెలుగు ఔన్నత్యాన్ని, ఆవశ్యకతను తెలియజేస్తూ రాజరాజ నరేంద్రుని పట్టాభిషేక సహస్రాబ్ది ఉత్సవాలకు నీరాజనంగా, నన్నయ భట్టారకుని మహాభారతం వెయ్యేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా గైట్ కళాశాల ప్రాంగణంలో మూడు రోజులపాటు నిర్వహించే అంతర్జాతీయ తెలుగు మహాసభలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఇదే ప్రాంగణంలో మరోవైపు ఐదు రోజులు నిర్వహించేలా ఇప్పటికే ప్రారంభమైన చతుర్వేద మహాయాగం, శ్రీవారి వైభవోత్సవాలకు ఈ మహాసభలు కూడా తోడయ్యాయి. దీనితో గైట్ కళాశాల ప్రాంగణంలో ఒకవైపు తెలుగు భాషా ఔన్నత్యాన్ని తెలియజేసేలా నిర్వహిస్తున్న సభలు, వక్తల ప్రసంగాలు, మరోవైపు భగవన్నామ స్మరణతో కూడా ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఆద్యాంతం ఆహ్లాదకరంగా, శోభాయమానంగా సాగుతున్నాయి. టీటీడీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నమూనా తిరుమలేశుని సెట్‌లో శ్రీనివాసుని దర్శించుకునే వారు కొందరైతే, తెలుగు భాష వేదికలపై ఉపన్యాసాలు, ప్రదర్శనలు ఇచ్చేవారు మరికొందరు. వీటన్నిటినీ వీక్షించి, విజ్ఞానం, వినోదాలను పొందేందుకు వచ్చే వారితో ఆ ప్రాంగణం జాతరను తలపిస్తోంది.

ఆకట్టుకున్న ప్రదర్శనలు

అంతర్జాతీయ తెలుగు మహా సభల సందర్భంగా ప్రధాన వేదికపై రాజమహేంద్రరంలోని వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు ఇచ్చిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఫ్యూచర్ కిడ్స్ విద్యార్థుల జానపద నృత్యంతో ప్రారంభమైన ఈ ప్రదర్శనలు ఒకరిని మించి మరొకరు అన్నట్టుగా పోటాపోటీగా సాగాయి. స్వాతంత్ర్య సంగ్రామంలో మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు ఘట్టం, సంక్రాంతి సంబరాలు, దాండియా నృత్యం, గొబ్బెమ్మల నృత్యాలతో అబ్బురపరిచారు. అలాగే ప్రగతి జూనియర్ కళాశాల విద్యార్థులు కూడా నువ్వానేనా అన్నట్టుగా మామ బంగారు అనే జానపద నృత్యంతో గ్యాలరీలో ఉన్న విద్యార్థులను కేరింతలు కొట్టించారు. వేదంలా ఘోషించే గోదావరి అంటూ గోదావరి అందాలు, రాజరాజనరేంద్రుడు, ఆదికవి నన్నయ, వీరేశలింగం తదితర ప్రముఖుల గురించి నృత్య రూపంగా తెలియజేశారు. బుర్రకథ ద్వారా గంగావతరణ గురించి వివరించారు. ఇలా అనేక ప్రదర్శనలతో విద్యార్థులు అందరినీ అబ్బురపరిచారు.

జగన్ పాలనలో బీసీల అభ్యున్నతి

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- దోసకాయలపల్లిలో బీసీ కమ్యూనిటీ హాలు ప్రారంభం



బీసీ సామాజిక భవన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

మధురపూడి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో బీసీ సామాజిక వర్గాల అభ్యున్నతి జరుగుతోందని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. కోరుకొండ మండలం దోసకాయలపల్లిలో బీసీ సామాజిక భవనాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వెనుకబడిన సామాజికవర్గాలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం భరోసా కల్పించిందన్నారు. బీసీ వర్గాలకు మంత్రి మండలి, మార్కెటింగ్ కమిటీల్లో ప్రాధాన్యం ఇచ్చినట్టు తెలిపారు. రూ. 23 లక్షలతో నిర్మించిన భవనాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం ఆయనను బీసీ వర్గాలు ఘనంగా సత్కరించాయి. కార్యక్రమంలో జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ మండల కో కన్వీనర్ గణేశుల పోసయ్య, సర్పంచుల సమాఖ్య మండల కన్వీనర్ కడియాల పాపారావు, పీఏసీఎస్ చైర్‌పర్సన్ గొల్లవిల్లి మురళి, వైఎస్సార్ సీపీ పార్టీ నాయకులు కడవల శివ, బేదంపూడి అబ్బాయి, కోనా శ్రీనివాసరావు, మండపాక శ్రీను, మేకా శ్రీనివాస్ పాల్గొన్నారు.

మాట తప్పని నేత జగన్

– ఎంపీపీ శ్రీదేవి



మర్రిపూడిలో లబ్ధిదారులకు పింఛను సొమ్ము అందిస్తున్న ప్రజాప్రతినిధులు

రంగంపేట: గత ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాట తప్పని నేతగా నిలిచారని ఎంపీపీ రిమ్మలపూడి శ్రీదేవి అన్నారు. శుక్రవారం మర్రిపూడి గ్రామంలో సర్పంచ్ వేము మాధవి ఆధ్వర్యంలో జరిగిన వైఎస్సార్ పింఛను కానుక రూ.3 వేలకు పెంపు, నూతన పింఛన్ల పంపిణీపై లబ్ధిదారుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎటువంటి వ్యయప్రయాసలు లేకుండా ప్రతి నెలా ఒకటో తేదీన లబ్ధిదారుల ఇంటి వద్దకే వలంటీర్లను పంపించి పింఛను అందిస్తున్నట్టు తెలిపారు. గతంలో ఏ ప్రభుత్వం ఇలా పింఛను అందించలేదని, ఇప్పుడు 60 ఏళ్లకే పింఛను వస్తుందని వివరించారు. ప్రజలకు మంచి చేయాలన్న చిత్తశుద్ధితో పనిచేస్తున్న జగన్‌కు ఎప్పుడూ అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ రాంబాబు, జెడ్పీ కో–ఆప్షన్ సభ్యుడు లంక చంద్రన్న, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఇజ్రాయేలు, రాష్ట్ర రైతు, చేనేత విభాగాల కార్యదర్శులు రిమ్మలపూడి వెంకటేశ్వరరావు, మండల జేఏసీ కన్వీనర్ మేడిశెట్టి రవిశంకర్, పార్టీ కన్వీనర్ వేము చిరంజీవి, ఉప సర్పంచ్ మేడిది చక్రం, పార్టీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

పేదల గుండెల్లో సీఎంకు స్థానం



తొస్సిపూడిలో పింఛను అందిస్తున్న నాయకులు

బిక్కవోలు: ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పేద ప్రజల గుండెల్లో ప్రత్యేక స్థానం ఉందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ప్రచార కమిటీ అధ్యక్షుడు రొంగల అప్పాజి అన్నారు. శుక్రవారం తొస్సిపూడి, కాపవరం, ఆరికరేవుల, మెళ్లూరు గ్రామాల్లో జరిగిన పింఛను పంపిణీ కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ప్రతి నెలా ఒకటిన లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వైఎస్సార్ పింఛను కానుక అందజేస్తున్నారన్నారు. ప్రజల ముంగిటకు వెళ్లి సంక్షేమ పథకాలు అందిస్తున్నట్టు తెలిపారు. రాజకీయాలతో సంబంధం లేకుండా, సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదే అన్నారు. అందుకే ప్రజలు ఆయనను గుండెల్లో పెట్టుకున్నారని, మళ్లీ ఆయన్నే ముఖ్యమంత్రిని చేస్తారన్నారు. ప్రతిపక్షాలు కలిసి పోటీ చేస్తామనడంతోనే వారి స్థాయి అర్థమవుతుందన్నారు. అనంతరం కొత్త, పెరిగిన పింఛన్లను లబ్ధిదారులకు అందించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు నల్లమిల్లి త్రినాథ్ రెడ్డి, ఎంపీటీసీ తేతల సుమ, కాపవరం సర్పంచ్ సత్యంశెట్టి వెంకటరమణ, మెళ్లూరు సర్పంచ్ సాయిరాం, ఉప సర్పంచ్ కొమ్మన ఆనంద్, పార్టీ మండల కన్వీనర్ పోతల ప్రసాద్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ బొడ్డు ముత్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

విశ్వసనీయతకు నిలువుటద్దం జగన్

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- కొత్త పింఛన్ల పంపిణీ



వృద్ధురాలికి నూతన పింఛను సొమ్మును అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: సామాజిక పింఛను పెంపుదల చేయడం ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అవ్వాతాతలు, అక్కచెల్లెమ్మల మోముల్లో ఆనందం పంచారని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని దుప్పలపూడి, మహేంద్రవాడ, పీరారామచంద్రపురం, కొప్పవరం, లక్ష్మీనరసాపురం గ్రామాల్లో లబ్ధిదారులకు నూతనంగా మంజూరైన పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథి ఎమ్మెల్యే మాట్లాడుతూ విశ్వసనీయతకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలువుటద్దమని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో అర్హత ఉన్నప్పటికీ లబ్ధిదారులు, జన్మభూమి కమిటీ సభ్యుల దయాదాక్షిణ్యాలపై ఆధారపడాల్సి వచ్చేదని, కమిటీ ప్రతినిధులు సూచించిన వారికే పింఛన్లు దక్కేవన్నారు. నేడు పింఛను కోసం పడిగాపులు పడాల్సిన అవసరం లేకుండా, కుల, మత, పార్టీలకతీతంగా, అర్హతే ప్రామాణికంగా ప్రతిఒక్కరికీ ప్రతి నెలా ఒకటో తేదీన వలంటీర్లు ఇంటి తలుపు తట్టి మరీ పింఛన్లు ఇస్తున్నారన్నారు. గతంలో 65 ఏళ్లు నిండితేనే పెన్షన్ వచ్చేదని, నేడు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో 60 ఏళ్లకే పెన్షన్ వర్తింపజేశారన్నారు.వైఎస్సార్ పెన్షన్ కానుక అవ్వాతాతలు, వితంతువులు, అనారోగ్యంతో బాధపడుతున్న వారు, దివ్యాంగులు తదితరులకు ఆర్థిక భరోసా కల్పిస్తోందన్నారు. కుటుంబ పెద్దలా ఉన్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలందరూ అండగా నిలవాలని కోరారు. అనంతరం లబ్ధిదారులకు రూ.3 వేల చొప్పున పింఛను సొమ్మును పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి, లక్ష్మీనరసాపురం, పీరారామచంద్రపురం సర్పంచ్‌లు దాట్ల కిరణ్‌రాజు, తేతల సుధాకర్‌రెడ్డి, వల్లభశెట్టి శివపద్మిని, ఆయా గ్రామాల ఎంపీటీసీలు, వార్డు సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అర్హత ఉంటే చాలు.. అందరికీ పింఛను



పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

- ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా
- తోకాడలో పింఛన్ల పంపిణీ

రాజానగరం: ముఖ్యమంత్రి జగన్ పాలనలో అర్హత ఉంటే చాలు అడిగిన వారందరికీ పింఛన్ మంజూరవుతోందని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. నియోజకవర్గంలోని సీతానగరం, కోరుకొండ, రాజానగరం మండలాలకు చెందిన 632 మందికి కొత్తగా మంజూరైన పింఛన్లను, 706 మందికి మంజూరైన రేషన్ కార్డులను మండలంలోని తోకాడలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విభజనతో ఆర్థిక పరిస్థితులు బాగోకపోయినాగాని, అంతా ఆనందంగా ఉండాలనే ఆలోచనతో సీఎం జగన్.. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ వచ్చారన్నారు. ఈనెల నుంచి పింఛన్ సొమ్మును రూ.2,750 నుంచి రూ.3 వేలకు పెంచారన్నారు.

రూ.2,300 కోట్లతో సంక్షేమం, అభివృద్ధి

గడచిన నాలుగున్నరేళ్లలో నియోజకవర్గంలో రూ.2,300 కోట్లతో సంక్షేమం, అభివృద్ధి జరిగిందని ఎమ్మెల్యే రాజా తెలిపారు. నియోజకవర్గంలో 2019 నాటికి 29,442 పింఛన్లు ఉండేవని, నేడు 41,227 మందికి అందజేస్తున్నామన్నారు. ఎన్నికల సమయలో తాను ఎమ్మెల్యేగా గెలిస్తే నియోజకవర్గ ప్రజలకు ముగ్గురు సేవలందిస్తారని చెప్పానని, కానీ నేడు ఐదుగురం పనిచేస్తూ, నిరంతరం ప్రజలతోనే ఉంటున్నామన్నారు. రాబోయే ఎన్నికలలో మరో అవకాశం ఇచ్చి, రాష్ట్రంలో రెండోసారి జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యేందుకు అంతా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు వాసంశెట్టి పెదవెంకన్న, సీతానగరం ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, సర్పంచ్ వేగిశెట్టి వీవీ చక్రధరరావు, మండల కన్వీనర్ దూలం పెద్ద, కో కన్వీనర్ గండి నానిబాబు, నాయకులు గంగిశెట్టి సోమేశ్వరరావు, అనదాస సాయిరామ్, అడబాల చినబాబు, కోలపాటి వెంకన్న, వేమగిరి కృష్ణ, గణేశుల పోశయ్య, గంటా శ్రీనివాస్, రఘురామ్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

జీఎస్ఎల్ దంత వైద్య కళాశాలకు 19 అవార్డులు

రాజానగరం: డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ పరిధిలోని జీఎస్ఎల్ దంత వైద్య కళాశాలకు 2022 – 23 విద్యా సంవత్సరంలో 19 ఎక్సలెన్స్ అవార్డులు వచ్చాయని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గంటా సునీల్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం కళాశాలలో జరిగిన ఫ్రెషర్స్ డే వేడుకలలో ఆయన ఈ విషయాన్ని వెల్లడిస్తూ, కళాశాల ప్రగతిని వివరించారు.

2020–23 బ్యాచ్‌లో వంద మందికి 95 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారన్నారు. మరో 19 మంది పీజీ పూర్తి చేశారన్నారు. డాక్టర్ నిఖితా శరణ్య బెస్ట్ ఆల్‌రౌండర్‌గా నిలిచారన్నారు. కార్యక్రమంలో ఎండీ డాక్టర్ గన్ని సందీప్, డైరెక్టర్ డాక్టర్ గోగినేని తరుణ్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

సారా కేసులో మహిళ అరెస్టు

రంగంపేట: సారా కేసులో మహిళను అరెస్టు చేసినట్టు సెబ్ సీఐ వెంకటలక్ష్మి తెలిపారు. శుక్రవారం రాత్రి ఆమె మాట్లాడుతూ ఈలకొలను గ్రామంలో దాడులు చేసి, గ్రామానికి చెందిన కురుకూరి మంగాదేవిని 35 లీటర్ల సారా, 800 లీటర్ల బెల్లపు ఊటతో అరెస్టు చేసినట్టు చెప్పారు. మంగాదేవికి సహకరించిన కురుకూరి రాజేష్‌పై కేసు నమోదు చేశామన్నారు.

ఘనంగా బలభద్రపురం బ్రహ్మోత్సవాలు ప్రారంభం

స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే దంపతులు

బిక్కవోలు: మండలంలోని బలభద్రపురం గ్రామంలో ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఉదయం సుప్రభాత సేవ, లఘుఅర్చన, తోమాలసేవ, స్వస్తివాచకం, వేంకటేశ్వర మహత్యం, గ్రంథ పారాయణ, పంచామృతాభిషేకం, గోపూజ, పవళింపు సేవ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం స్వామివారిని శేష వాహనంపై గ్రామోత్సవం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తిరుమల వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు మనకు అందుబాటులో ఉండేలా ఇక్కడ పూజా కార్యక్రమాలు నిర్వహించడం ఆనందదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లిడి గంగారెడ్డి, ఎంపీపీ కొవ్వూరి జ్యోతిర్మయి, సత్యనారాయణరెడ్డి దంపతులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు

చిన్న తప్పిదం.. భారీ మూల్యం..!

- ప్రమాదపుటంచున ప్రయాణం
- నిబంధనలన్నీ తుంగలోకి..



పట్టుతప్పితే ఇంతే..: పందలపాకలో అపాయకరంగా ఆటో ప్రయాణం

బిక్కవోలు: ప్రమాదకర రీతిలో చేస్తున్న ప్రయాణాలు ప్రజల పాలిట శాపంగా పరిణమిస్తున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా, లెక్కకు మించి ప్రయాణికులతో కిక్కిరిసిన వాహనాలు.. అడ్డూ అదుపూ లేకుండా, మితిమీరిన వేగంతో ప్రయాణిస్తున్నాయి. ముఖ్యంగా వ్యవసాయ పనుల కోసం మహిళలు ఎక్కువగా ఆటోలను ఆశ్రయిస్తున్నారు. కూర్చునే వీల్లేకపోయినా.. కిక్కిరిసిన ఆటోల్లో వేలాడుతూ ప్రయాణం సాగిస్తున్నారు. ప్రమాదవశాత్తు అపాయం జరిగితే.. జీవితాలు చిన్నాభిన్నమయ్యే పరిస్థితి తప్పదని పలువురు హెచ్చరిస్తున్నారు. ఇటీవల కాలంలో ఆటో ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయి. అతి వేగం, పరిమితికి మించిన ప్రయాణికులను ఎక్కించుకోవడమే కారణమంటున్నారు. బస్సు సర్వీసులు అంతగా లేకపోవడంతో ప్రమాదమని తెలిసినా, ఆటోలను ఆశ్రయించాల్సి వస్తోందని ప్రయాణికులు చెబుతున్నారు. ఇతర గ్రామాలకు వలస వెళ్లి, కూలీ పనులు చేసుకునే వారు కూడా ఆటోల్లో ప్రయాణాలు సాగిస్తున్నారు. మారుమూల ప్రాంతాల నుంచి ప్రయాణమంటేనే ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సిన పరిస్థితి. ప్రస్తుతం గ్రామాల్లో ఆటోల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఒక్కో గ్రామానికి ఐదు నుంచి పది వరకు ఆటోలున్నాయి. అనపర్తి నియోజకవర్గంలో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. నియోజకవర్గంలో సుమారు 600 ఆటోలున్నాయి.

కేసులు నమోదు చేస్తున్నాం



మితిమీరిన ప్రయాణికులతో వెళ్తున్న వారిని, వాహనాలు వేగంగా నడుపుతున్న వారిని, అలాగే లైసెన్సులు లేనివారిని గుర్తించి ఇప్పటికే పలు కేసులు నమోదు చేశాం. ప్రతి నెలా తనిఖీలు నిర్వహిస్తున్నాం. నిబంధనలు పాటించని వారిపై చర్యలు తప్పవు.

– పి.బుజ్జిబాబు, ఎస్సై, బిక్కవోలు

పేదలందరికీ కార్పొరేట్ వైద్యం

మధురపూడి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో పేదలందరికీ కార్పొరేట్ వైద్యం అందుతోందని జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు అన్నారు. కోరుకొండ మండలం దోసకాయలపల్లిలో శుక్రవారం రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా వైద్యశిబిరం నిర్వహించారు. ఎంపీడీఓ పీఎస్ నరేష్‌కుమార్ మాట్లాడుతూ ప్రజలంతా ఆరోగ్యంగా ఉండాలన్న లక్ష్యంతో రెండవ దఫా ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా 519 మందికి వైద్య పరీక్షలు జరిపి, మందులు పంపిణీ చేశారు.

పేదల ఆరోగ్యమే జగనన్న లక్ష్యం



రోగులకు మందులు అందిస్తున్న ప్రజాప్రతినిధులు

రంగంపేట: పేదలందరూ ఆరోగ్యంగా ఉండాలన్న లక్ష్యంతోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్య సురక్ష పథకాన్ని ప్రవేశపెట్టారని సర్పంచ్ జాస్తి వెంకట పద్మావతి అన్నారు. చంద్రేడు గ్రామంలో పీహెచ్‌సీ వైద్యాధికారి బి.వేణుశ్రీలక్ష్మి ఆధ్వర్యంలో శుక్రవారం ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్షను ప్రజలందరూ వినియోగించుకోవాలన్నారు. శిబిరంలో రాజమహేంద్రవరం నుంచి వైద్యులు షమ్మీకుమార్, గంగాధర్, ఎస్.షణ్ముఖ, సాయి ఉజ్వల తదితరులు 346 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. జెడ్పీటీసీ పి.రాంబాబు, జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు లంక చంద్రన్న, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కొల్లాటి ఇజ్రాయిల్, రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి రిమ్మలపూడి వెంకటేశ్వరరావు, మండల జేఏసీ కన్వీనర్ మేడిశెట్టి రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు. ఎంపీటీసీ కంటిపూడి శేషారత్నం, పార్టీ నాయకులు జాస్తి సత్తిబాబు, కంటిపూడి రామదేవుడు, సీహెచ్ఓ కె.జయమణి పాల్గొన్నారు.

ఫైనాన్స్ వ్యాపారి ఆత్మహత్య

పెదపూడి: కరకుదురు గ్రామంలో శుక్రవారం రాత్రి ఓ ఫైనాన్స్ వ్యాపారి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై శోభన్‌కుమార్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన తోటకూర చక్రరావు (46) ఫైనాన్స్ వ్యాపారం చేసేవాడు. శుక్రవారం ఉదయం ఎప్పటిలాగే అందరితో కలసి మాట్లాడాడు. రాత్రి సమయంలో ఓ నర్సరీ వద్ద చక్రరావు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇతరులకు అతడు నగదు అప్పుగా ఇచ్చాడు. అలాగే ఇతరుల వద్ద అప్పులు కూడా చేశాడు. ఈ నేపథ్యంలో చేసిన అప్పులకు వడ్డీ కట్టలేక ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చక్రరావుకు రూ.32 లక్షల వరకు కొంత మంది ఇవ్వాలని, వారి పేర్లతో లేఖ రాసి, జేబులో పెట్టుకున్నట్టు పోలీసులు గుర్తించారు. మృతుడికి భార్య దుర్గ, కొడుకు, కుమార్తె ఉన్నారు. ఎస్సై శోభన్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని, వివరాలు సేకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

31 వరకూ గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు

సీతానగరం: పశువులకు ఈనెల 31వ తేదీ వరకూ గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేస్తామని వెదుళ్లపల్లి పశువైద్యులు డాక్టర్ భాను తేజ శుక్రవారం తెలిపారు. ఇప్పటి వరకూ మండలంలో 700 పశువులకు టీకాలు వేశామన్నారు. పశుబీమా పథకం ద్వారా ప్రభుత్వం రాయితీపై పశువులకు అందిస్తోందన్నారు. అలాగే గొర్రెలు, మేకలు, పందులు, ఆవులు, గేదెల్లో ఒక ఈత ఈనిన వాటికి వర్తిస్తుందన్నారు. పూర్తి వివరాల కోసం దగ్గరలోని రైతు భరోసా కేంద్రంలో, లేదా పశువుల ఆసుపత్రుల్లో సంప్రదించాలన్నారు.

విద్యార్థి నాయకుల ఎన్నిక

సీతానగరం: చినకొండేపూడి జిల్లా పరిషత్ హైస్కూల్లో శుక్రవారం ఎస్‌పీఎల్, ఏఎస్‌పీఎల్ ఎన్నికలు నిర్వహించారు. విద్యార్థులకు ఎన్నికలపై అవగాహన కలిగేలా ఈవీఎం నమూనా ద్వారా వీటిని నిర్వహించామని ప్రధానోపాధ్యాయురాలు సామవేదం ఉషారాణి తెలిపారు. ఉదయం 10.45 నుంచి మధ్యాహ్నం 12.15 గంటలకు పోలింగ్ జరిగింది. ఫలితాలలో ఎస్‌పీఎల్‌గా 9వ తరగతి చదువుతున్న చిడిపి సాత్విక, ఏఎస్‌పీఎల్‌గా 8వ తరగతి సూరపురెడ్డి సర్వేష్ గెలుపొందారని పాఠశాల పేరెంట్ కమిటీ చైర్మన్ ఎస్.రామకృష్ణ, హెచ్ఎం ఉషారాణి ప్రకటించారు.